

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 ఫిబ్రవరి-2025 సంచిక : 9

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

| **విషయసూచిక** | **పుట సంఖ్య** |
|---|---|

మా వాణి ........................................ 2
బాలవాణి-అది మన పనికాదు ...... 5
కర్మ త్యాగం కుదురుతుందా?......... 8
రామనాథ బ్రహ్మచారి ......................... 10
నాకెందుకు వజ్రపుటుంగరం ...... 15
జననము-బాల్యము .......................... 17
శ్రీ సాయి నిత్య పారాయణ ........... 18
శాశ్వత ధర్మగోప్త ................................ 21
సాయిభక్త దాసగణు ........................... 24
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 27
మాతృసంస్థ కబుర్లు ......................... 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి

***మిత్రులందరికీ శివరాత్రి శుభాకాంక్షలు.***

మనిషికి అంతశ్శత్రువులూ, బాహ్య శత్రువులూ యిద్దరూ ఉంటారు. బాహ్యశత్రువుతో మనకు పేచీ లేదు. వాళ్లు శత్రువులని మనకు తెలుసు. పోరాడగలం-చంపగలం. శత్రుశేషం లేకుండా చేసుకోగలం. కానీ, యీ అంతశ్శత్రువులతో చాలా కష్టం. లోలోపలే ఉంటారు. వీళ్లంతా ఒకరిని బట్టి మరొకరు పెరుగుతూ ఉంటారు. ఇదంతా ఓ బెటాలియన్. ఒకరికొకరు అతుక్కొనే ఉంటారు. కనుకనే దీన్ని వర్గం అన్నారు. కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం-ఇవన్నీ ఒకదానికన్నా మరొకటి బలమైనవి. అంచేత వీటిని జయించటం చాలా కష్టం.

కామం-అంటే కోరిక. ఆ కోరిక తీరకపోతే వచ్చేది క్రోధం. ఒకవేళ తీరితే ఆ దొరికినది తనకే కావాలనే స్వార్థపు ఆశ - అదే లోభం. ఒకవేళ తనకే పూర్తిగా దొరికితే-దాన్ని విడిచి ఉండలేని మోహం. నేను గదా యింత సాధించగలిగానన్న అహం-అదే మదం. వీటన్నిటికీ ఒక దానితో ఒకటి లింక్ ఉంటుంది. కానీ, యీ చివరిది మాత్సర్యం మాత్రం నిష్కారణంగా పుట్టి మన మనసును తొలిచి తొలిచి పాములపుట్టగా తయారుచేస్తుంది. పొరుగువాడికి ఏదో దొరికింది-వాడు మన దగ్గరేమీ లాక్కోలేదు. వాడికి అదేదో దొరికినందువలన మనకు కలిగే నష్టమేమీ లేదు. అయినా సరే మనలోపల అసూయ. ఎందుకో తెలియదు. వాడిని చూచినప్పుడల్లా కళ్లల్లో నిప్పులు పోసుకున్నట్లే భావన. ఈ శత్రువును ఎలా జయించగలం?

అరిషడ్వర్గాన్ని జయించడానికి ఆత్మవిచారం ఒక్కటే మార్గమని పెద్దలు సెలవిచ్చారు. "ఇది నాకు అవసరమా? అనే ప్రశ్న, "ఇది నాకు అవసరమైతే భగవంతుడు నాకు ఇచ్చేవాడే గదా! ఆయన దయ గలిగితే ఎవరడ్డుకోగలరు?"అన్న విశ్వాసంతో క్రోధాన్ని, "నాకే అంతా దక్కాలనుకోవటం స్వార్థం, పిసినితనం గదా!" అన్న విచారణతో లోభాన్ని, "నేను ఇది లేక ముందు కూడా ఉన్నాను. ఒకవేళ ఇది పోయినా ఉంటాను. ఎందుకింత మోజు (మోహం)?" అన్న వింగడింపుతో మోహాన్ని తొలగించుకొనే ప్రయత్నం చెయ్యాలి. "ఇంతకన్నా ఎంతెంతో సాధించిన వారేమైనా మిగిలారా పృథ్వీ తలంపైన! ఎప్పడైనా యివన్నీ వృథాగా వదిలేసిపోవలసిందే గదా!" అన్న స్పష్టతతో మదాన్నీ - "పుచ్చకాయ తియ్యగా ఉంటే వెర్రి పుచ్చకాయ వెక్కెక్కి ఏడ్చినట్లు పొరుగువాడు పచ్చబడితే నా కళ్లు పచ్చబడిపోవటం కుళ్లుబోతు తనం గదా! నాకీ అల్పత్వం అవసరం లేదు గదా!" - యిలాటి తార్కిక యోచనతో మాత్సర్యాన్ని కూడా గెలవవచ్చునని మా గురుదేవులు స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు వివరించే వారు.

పోతనగారి అత్యద్భుతమైన పద్యం ఒకటి ఉంది భాగవతంలో. ప్రహ్లాదుడు శ్రీహరి భక్తుడు. తండ్రికి అది నచ్చలేదు. గురువులచెంత విద్యాభ్యాస్యానికై పంపించాడు. ఈ ఐదేళ్ల పసివాడు గురువులకు, సహాధ్యాయులకు కూడా బోధ ప్రారంభించాడు. కోపించిన హిరణ్యకశ్యపుడు "మహాబలుల జయించితిని నా ముందర వానిని పొగుడుతావా?" అని రంకెలు వేసాడు. అప్పడు ప్రహ్లాదుడు అంటాడు -

"లోకములన్నియున్ గడియలోన జయించినవాడ వింద్రియా
నీకము, చిత్తముం గెలువనేరవు - నిన్ను నిబద్ధుజేయు నీ
భీకర శత్రువులార్వుర( బ్రభిన్నుల జేసిన ప్రాణి కోటిలో
"నీకు విరోధి లేడొకడు నేర్వన, జూడుము దానవేశ్వరా!"

ముజ్జగాలనూ క్షణంలో గెలిచావేగానీ, లోపలి శత్రువులు ఆరుగురూ అలాగే





ఉండిపోయారే! వారిని గెలిచావనుకో. నీకింక శత్రువన్నవాడే ఉండడు. ఆ పని చెయ్యి తండ్రీ!" అన్నాడు.


అరిషడ్వర్గం నశించిననాడు- సర్వం భగవన్మయమే. తానూ పరులూ అన్న భేదం పోతుంది గనుక-ఎవరితోనూ శత్రుత్వం ఉండదు గదా మరి! అందుకే ఆ సలహా. స్వామీ వివేకానందులు ఓ చక్కని సందేశం యిచ్చారీ విషయంలో. "కామక్రోధాదులను అణచకండి. మీలోని కామాన్ని పరమాత్మని పొందటం వైపు, క్రోధాన్ని మీ బలహీనతలవైపు త్రిప్పండి. మీ మోహాన్ని భగవంతుని ఎడబాటును సహించలేని తొందరగాను, మదాన్ని ధర్మాహంకారంగాను మార్చుకోండి. మీకన్నా సాధనలో ముందున్న వారిపై యీసు చెందండి. వారిని దాటి వెళ్లడానికి ప్రయత్నించండి" అంటూ.

ఈ వైరి వర్గానికి నాయకులిద్దరున్నారు. అహంకారం, మమకారం వాళ్ల పేర్లు. 'నేను అరిషడ్వర్గాన్ని గెలిచాను' అనుకొంటే అహంకారంలో పడినట్లే. తన తనువునే కాదు-తన గోచిపాతనైనా సరే-నాది అనుకొంటే అది మమకారమే. ఈ యిద్దరూ మహామహా ప్రమాదకారులైన వాళ్లు చాప క్రింద నీళ్లలాంటి వాళ్లు.

మొత్తం మీద అంతశ్శత్రువులంతా మహా బలశాలురు. నిత్యం ఆత్మ విచారణ చేసుకొంటూ జాగ్రత్తపడితే తప్ప - వారు మనను పడవెయ్యడానికే చూస్తుంటారు సుమా! తస్మాత్ జాగ్రత్త! అందుకే ఈ అరిషడ్వర్గాన్ని జయించి తనలోని సర్వజ్ఞానాలను వికసింపజేసుకొని, మూడవ కన్ను వికాసింపజేసుకొన్నవాడే పరమేశ్వరుడు. ఈ శివరాత్రి పర్వదినాన క్షణక్షణం ఆ కామ హంతకుని స్మరిస్తూ మనలోని శత్రువును జయిస్తే (లింక్ తెగ్గొడితే అన్నీ విడిపోతాయనుకున్నాం గదా!) ఒక్కొక్కటి బలహీనమై నశిస్తాయి. ఆ శివ స్మరణతో మనకంతా శివం-శుభం కలుగుతుంది. సాయి శివుని హృదయానికి దగ్గరగా తెచ్చుకుందాం. మనను మనం గెలుద్దాం.

## బాలవాణి

# అది మా పని కాదు



**- మాతాజీ**

రామాపురంలో కృష్ణయ్యగారు పెద్ద రైతు. ఆయనకు వంద ఎకరాల వ్యవసాయం. అదీ ఒకచోట కాకుండా నాలుగైదు చోట్లగా ఉంది. అందుచేత ఆయన తన పొలాలు చూసుకోవటానికి బండ్లమీదనో, పల్లకీలోనో వెళుతుండేవాడు. అందుకు ఓ బండివాడు, నలుగురు బోయీలు (పల్లకీ మోసేవారు), ఈ బోయీలకు ఎప్పుడోగాని పనిబడేది కాదు. అమ్మగారు గుడికి వెళతానంటేనో, అమ్మాయిగారు అత్తగారి ఇంటినుంచి వస్తోంటేనో, కృష్ణయ్యగారు బండి కుదుపు భరించలేనప్పుడో తప్ప ఈ బోయీలు ఖాళీగానే ఉండేవారు. మరీ ఊరికే ఉన్నట్టు కాకుండా ఆ కట్టెల మోపు ఇటు తేవడమో, ఈ మంచం అటు వేయడమో చేస్తూ ఉండే వారు, కృష్ణయ్యగారి దగ్గర బోలెడన్ని ఎడ్లు, ఆవులు మొదలైనవి ఉండేవి.

ఇలా ఉండగా ఓసారి కృష్ణయ్యగారి గోశాలనుండి ఓ చిన్న దూడ ఎటో వెళ్లిపోయింది. అది పుట్టి ఇంకా నెలనాళ్లు కూడా కాలేదు. దాని తల్లి-ఆవు పేరు కపిల. అది కోడలమ్మగారు పుట్టింటినుంచి అరణం (కట్నం) తెచ్చుకున్న ఆవు. ఎప్పటిలాగే పెద్ద పాలేరు పాలు తీసి దూడను విప్పాడు. మామూలుగా దూడలు తల్లి పొదుగులో పాలు మొత్తం బొజ్జనిండా తాగేస్తాయి. ఆ పాలన్నీ అరగాలంటే అవి చెంగుచెంగున ఎగురుతూ ఓ గంటసేపు ఆడుకోవాలి. ఆ తరువాత చిన్నపాలేరు అలాంటి దూడలన్నింటినీ కట్టేస్తాడు. అదీ రోజూ జరిగే పద్ధతే. కానీ ఆవేళ ఎలా పొరపాటు జరిగిందో ఈ బుజ్జిదూడ దీని పేరు జాబిల్లి (ఇది సోమవారం పుట్టింది అందుకే





దీనికి ఈ పేరు). ఎలాగో పెరడు దాటి అవతలికి వెళ్లిపోయింది. తన దూడ రాలేదని కపిల గోలగోలగా అరుస్తుంటే అర్ధరాత్రి పెద్ద పాలేరుకు మెలకువ వచ్చింది. అతడు గబగబా గోశాలలోకి వెళ్లి చూసుకుంటే జాబిల్లి కనిపించలేదు. దానితో అతడు చిన్నపాలేరును నిద్రలేపాడు. ఇద్దరూ కలిసి ఒక లాంతరు చేత్తో పట్టుకొని పెరడంతా కలియతిరిగారు. లేదు. నాలుగు వీధులూ తిరిగారు. కనబడలేదు. వాళ్లకు ఏం చెయ్యాలో తోచక ఇంటికి వచ్చి అబ్బాయిగారిని నిద్రలేపి చెప్పారు. అంతలో తెల్లవారింది.

కృష్ణయ్యగారి కోడలు తన ఆవుదూడ పోయినందుకు చిన్నబుచ్చుకుంది. ఇప్పుడు కపిలకు పాలు తియ్యాలి. తియ్యాలంటే దూడ కావాలి. ఎలా? కృష్ణయ్య గారు బోయీలను పిలిచి "ఒరే అబ్బాయిలూ మన జాబిల్లి ఎటో వెళ్లిపోయిందట! ఏ కుక్కలైనా పీకేస్తాయి కూడ. అందుచేత మీరంతా తలో దిక్కు పరుగెత్తుకు వెళ్లి వెతుక్కురండి. ఇవాళ చేలో కలుపుతీసే పనుంది. అందుచేత పాలేళ్లకు కుదరదు. మీరు వెళ్లి ఆ దూడ పని చూడండి" అని అన్నారు. ఆ బోయీలు తెల్లవారుజాము దాక పొరుగూరిలో ఆడుతున్న చింతామణి నాటకం చూసి వచ్చి - అప్పుడే పడుకున్నారు. ఆ రోజుల్లో రైతులకు పగలు పని చెడకుండా అలా రాత్రి తెల్లవార్లు నాటకాలు వేస్తుండేవారు. సరే మన వాళ్లు- అదే బోయీలు ఇంకా నిద్రమత్తులోనే ఉన్నారు. అందులో ఒకడు కాస్త పొగరు బోతు కుర్రవాడు. వాడు "అయ్యగారూ, అది మా పని కాదండి. పల్లకి మొయ్య మనండి. ఎంతసేపయినా మోసేస్తాం. కాని ఆ దూడలను గుర్తుపట్టడం అదీ మాకు రాదండీ" అన్నాడు. కృష్ణయ్యగారు మిగిలిన వారి మొహాలు చూసారు. అందరూ ఆ కుర్రవాడి మాటలకి ఒప్పకుంటున్నట్టుగానే

నిశ్శబ్దంగా ఊరుకున్నారు.

కృష్ణయ్యగారు పది నిముషాల్లో తయారవ్వండి అని వారికి చెప్పి, తాను వెళ్లి గభాల్న స్నానం చేసి వచ్చేసారు. ఈ లోపల బోయీలు పల్లకి సిద్ధం చేసారు. కృష్ణయ్యగారు ఎక్కి కూర్చున్నారు. "ఇక పదండి" అన్నారు. "ఎక్కడికి బాబూ ఏ ఊరు?" అన్నారు బోయీలు. 'నడవండీ చెప్తాగా' అన్నారు కృష్ణయ్యగారు. యాత్ర సాగింది. ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది గంటలయ్యింది. రెండూళ్లు తిరిగారు. ఎక్కడా దూడ కనిపించలేదు. పల్లకీని కొండల్లోంచి, గుట్టల్లోంచి తీసుకు పొమ్మంటున్నారు కృష్ణయ్య గారు. బోయీలకు కాళ్లు పుళ్ళు పడిపోయినాయి. ఇంకా ఎంత దూరం బాబుగారు!" అన్నారు ఆయాసపడుతూ వాళ్లు.

"నేను ఇంటి యజమానిని. పోయిన వస్తువును వెతుక్కుంటున్నాను. నా పని నేను చేసుకుంటున్నాను. మీ పని మీరు చెయ్యండి. ఇది తప్పదు" అన్నారు కృష్ణయ్యగారు గంభీరంగా. బోయీలు మొహాలు చూసుకున్నారు. ఒక చెట్టు క్రింద పల్లకీ దింపారు. "బాబూ, మా తప్ప మాకు తెలిసొచ్చింది. తమరిని ఇంటికి తీసుకు వెళతాం. మేము వెళ్ళి దూడను వెతుక్కొస్తాం" అన్నారు. సరేనన్నారు కృష్ణయ్యగారు. అలాగే బోయీలు కృష్ణయ్యగారిని దింపి, కాస్త అంబలి తాగి నాలుగు వీధులూ తిరిగి దూడను వెతకసాగారు. తీరా చూస్తే అది నాలుగో ఇంటివాళ్ల గోశాలలో మూల పడుకొని కనిపించింది. మొత్తం మీద జాబిల్లీ దొరికింది, బోయీలకు బుద్ధీ వచ్చింది.

చూచారర్రా పిల్లలూ, ఏదైనా కష్టసమయం వచ్చినప్పడు నలుగురూ కలిసి పరిష్కారం చూడాలి గానీ - ఇది మా పని - అది మీ పని అని గీతలు గీసుకోకూడదు. గుర్తుంచుకోండి.





# కర్మత్యాగం కుదురుతుందా?

**- ("జ్ఞానేశ్వరి" నుండి) జ్ఞానేశ్వర మహరాజ్**

"ఆరంభమున ఉచితము, విహితమునగు ఏ కర్మలను ఆచరించుట అవశ్యకమో ఆ కర్మలను చేయకయే, "నేను సిద్ధులవలె కర్మను త్యజింతును" అని చెప్పతుండునట్టి కర్మహీనునికి అది నిష్కర్మత్వము కానేరదు. తనకు ఏర్పడియున్న కర్తవ్యములను విడిచిపెట్టి కూర్చున్నంత మాత్రమున నైష్కర్మ్య సిద్ధించినదని భావించుట గొప్ప మూర్ఖత్వము. చూడుము, నది తీవ్రముగా ప్రవహించుచున్నప్పడు ఆవలి ఒడ్డుకు వెళ్ళుట కష్టముగానున్నదనుకొనుము, అట్టి సమయమున ఒక నావపై ఆవలి ఒడ్డునకు వెళ్ళక, దానిని త్యజించుట తెలివిగల పనియా? ఆకలిని శాంతింపజేసుకొనవలెనని తలచెననుకొనుము. అందుకై ఏల వంట చేయరాదు? వంట తయారై సిద్ధముగా ఉన్నప్పడు ఏల తినరాదు? వాసన నశించనంతవరకు కర్మ ఎల్లప్పడు వెంటాడుచునే యుండును. మనుష్య నకు అఖండానందము ప్రాప్తించినప్పడు మాత్రము సమస్త కర్మలు తమకు తామే ఆగిపోవును. కాన ఓ అర్జునా! హృదయపూర్వకముగ నిష్కర్మత్వము (కర్మత్యాగము)ను సాధించదలచినచో, అతని స్వధర్మవిహితమగు కర్మ లను పరిత్యజించరాదు. మన యిష్టానుసారము కర్మలు చేయుచున్నచో కర్మలు సిద్ధించుననియు, కర్మలను పరిత్యజించుచో కర్మలుండక నశిం చుననియు, కొందరు చెప్పదురు. అట్టి మాటలు వ్యర్థమైన వెర్రిమాటలు. కేవలము కర్మలను వదిలిపెట్టినంత మాత్రమున మానవుడు వాస్తవముగ వాటినుండి విముక్తుడు కాలేడను విషయమును మాత్రము నీవు జ్ఞప్తి యందుంచుకొనుము.

"గుణములకు జననియగు మాయ ఆధారముగనున్నంతవరకు

మనము అజ్ఞానవశమున కర్మలను చేయుచునేయుందుము. ఆ కర్మలన్నియు తమంతతామే గుణములపై అవలంబితమైయుండును. మన విహితకర్మలను ఏదో ఒక మానసిక ఆవేశము మూలమున చేసినప్పటికీ, విడిచినప్పటికీ శారీరిక అవయవముల స్వాభావిక ధర్మములు నశింపవు. చెవి వినుటను మానునా? కన్ను చూచుట మానునా? ముక్కు రంధ్రములు పూడిపోయి, వాసన చూచుట మానునా? మానసికావేశము వలన ప్రాణాపానవాయుగతి ఆగునా? చిత్తము నిర్వికల్పమగునా? ఆకలి దప్పులు మొదలగు కోరికలు నశించునా? జాగ్రత్స్వప్నావస్థలు నశించునా? పాదములు నడువవా? ఈ విషయములన్నియటుండనిండు-జనన మరణముల తప్పనా? వీనిలో ఏ ఒక్కటీ తప్పనపుడు కర్మలను విడచిన ప్రయోజనమేమి? కావున ఎప్పటివరకు మాయ ఉండునో అప్పటివరకు కర్మ ఉండియేతీరును-కర్మయొక్క త్యాగము కుదరదు. మాయ యొక్క స్వాభావిక బలము వలననే సర్వకర్మలు తమంతతాము జరుగుచుండును. అందువలననే మాయ ఉన్నంతవరకు ఏ విధమగు నిగ్రహము వలన అంతఃకరణను బంధించి ఉంచినను-అదంతయు నిష్ఫలమే. మనము రథములో కూర్చున్నపుడు మనమెంత నిశ్చలముగా కూర్చున్నప్పటికిని పారతంత్ర్యము వలన యిటునటు ఊగులాడుచునే ఉందుముగదా! ఎండుటాకులు తమంతతాము కదలవు. కాని తీవ్రముగ గాలి వీచినపుడు అవి కూడ ఆకాశమునకెగురును. ఇదేరీతిన మాయ ఆధారముగా ఉన్నందువలన కర్మేంద్రియములు చలించును. మాయ వీటిని పట్టి ఉంచటం వలననే నిరంతరం నిర్మలంగా ఉండాలని యత్నించే వారిలో కూడా కర్మ అయత్నంగానే జరుగుతుండును. కనుక మాయతో సహవాసం ఉన్నంతవరకు కర్మత్యాగం జరగనే జరగదు. ఇట్టి స్థితిలో కర్మత్యాగం చేసామని అనటం కేవలం మూర్ఖత్వమే అవుతుంది సుమా!





# రామనాథ బ్రహ్మచారి

**- రమణ పెరియ పురాణం నుంచి**

భగవాన్ ఒకసారి ఇలా అన్నారు, "నాకు ఇద్దరే ఇద్దరు వ్యక్తులంటే భయం. ఒకరు రామనాథ బ్రహ్మచారి, రెండవ వారు మొదలియార్‌పాటి". ఆయన అలా ఎందుకన్నారంటే, ఆ ఇద్దరు సాధువులూ గూడా భగవాన్‌ను అత్యంత నిస్వార్థ భక్తితో సేవించారు.

రామనాథ బ్రహ్మచారి, పట్టణంలోని వేదపాఠశాల విద్యార్థి, ఆయన భగవాన్‌ను కలిసినపుడు, ఆయన మనసు, హృదయము వికసించి ఆయన పూర్తిగా గాఢమౌనంలో (నిశ్శబ్దంలో) మునిగిపోయినట్లనిపించింది. భగవాన్‌తోటి ఎంతకాలం వీలైతే అంతకాలం ఉండిపోవాలని అప్పటికప్పడే ఆయన నిర్ణయించుకున్నారు. పాఠశాల ఉచిత భోజన వసతి సదుపాయాలను సమకూర్చినప్పటికి, యువకుడైన రామనాథుడు భగవాన్‌తో ఉండిపోవడానికి మొగ్గుచూపారు. ఆయన వీధులలో బిచ్చమెత్తి, లభించిన ఆహారాన్ని భగవాన్‌కు సమర్పించి, ఆయనతోపాటు దొరికిన దానిని తృప్తిగా భుజించేవారు. ఆయన విధేయత అంత అపురూపంగా ఉండేది. భగవాన్ తల్లి అప్పటికింకా సనాతన ఆచారాలను పాటించుట వలన బ్రాహ్మణ బాలుడైన ఈయన సేవలను అంగీకరించేవారు. ఆయన గిన్నెలను కడగటమే కాకుండా, ఆవిడ దుస్తులను కూడా ఉతికేవారు. ఆమె ప్రతి పనికీ రామనాథా! రామనాథా! అని పిలుస్తుండేవారు. ఆమె పిలుపులు వింటూ, "మా తల్లి గారి జపం మళ్ళీ మొదలైంది", అని భగవాన్ హాస్యమాడేవారు.

ఒకనాడు భగవాన్, రామనాథతో, "ఆత్మను సాక్షాత్కారింపజేసుకొనుటలో నువ్వు సఫలీకృతుడవైనావు", అని చెప్పారు. రామనాథ నమ్మలేక

పోయారు. రామనాథ పదే పదే 'ఆ మాట నిజమేనా?' అని భగవాన్‌ను అడుగసాగారు. భగవాన్ చాలాసార్లు, "అవును రామనాథా! నీవు ఆత్మ సాక్షాత్కారం పొందావు", అని చెప్పారు. అయినా అతనికి ఇంకా నమ్మకం కుదరలేదు. భగవాన్ లేచి నుంచొని అతని తల మీద చిన్నగా మొట్టి, "అవును రామనాథా! నీవు సాక్షాత్కారం పొందావు" అన్నారు. ఆ అమాయక భక్తుడు, పారవశ్యంతో గది బయటకు పరుగెత్తి, కన్పించిన ప్రతి ఒక్కరితో ఇదిగో ఇక్కడ భగవాన్ నా తలపై మొట్టికాయ వేశారు అని చెప్పాసాగారు. భగవాన్ ప్రేమగా మొట్టికాయ వెయ్యడమే, సాక్షాత్కారం కంటే ఎక్కువగా కన్పించింది ఆయనకు.

ఈ అమాయక శిష్యుడు, భగవాన్‌కే కాకుండా, ఆయన ఇతర శిష్యులకు గూడ సేవ చేసేవారు. ఆయన పల్లాకొత్తులో ఉండడం ప్రారంభించినపుడు, కావ్యకంఠ, మురుగనార్, పాల్‌బ్రంటన్, కోహెన్, విశ్వనాథ స్వామి, కుంజు స్వామి కూడా అక్కడే ఉండేవారు. వాళ్ళ ఏకైక లక్ష్యము, భగవాన్‌తో వీలున్నంత ఎక్కువసేపు గడపడమే. వాళ్ళే కనుక ఆశ్రమ ఆఫీసులో పనిచేస్తున్నట్లయితే ఇది సాధ్యమయ్యేది కాదు. ప్రతిరోజు సాయంత్రం, తనకు తానుగా రామనాథ బ్రహ్మచారి ఎంతో అంకితభావం తోను, శ్రద్ధాభక్తులతో వారందరి కుటీరాలను చిమ్మి శుభ్రం చేసి, వాళ్ళ దీపాలను కూడా శుభ్రం చేసి పెట్టేవారు. పగటిపూట బస్తీకి వెళ్ళి, వాళ్ళకు కావలసిన సరుకులు తెచ్చి పెట్టేవారు. ఈ పనులన్నీ చేస్తూ కూడా భగవాన్ సన్నిధిలో కాలం గడపడానికి కావలసినంత సమయం ఉండేది ఆయనకు. భగవానే ఆయనకు సర్వస్వము.

పల్లాకొత్తులో నివాసముండే వారు, ఈయన సేవలను గురించి భగవాన్‌కు చెప్పలేదు. ఒకనాడు, విశ్వనాథ స్వామికి ఒక పోస్టుకార్డు వచ్చింది. దానిపైన "దయచేసి పల్లాకొత్తు సర్వాధికారికి, నా ప్రణామాలు





తెలియజేయండి" అని ఉన్నది. భగవాన్ కొన్నిసార్లు స్వయంగా, పోస్టులో వచ్చిన ఉత్తరాలను, ఎవరివి వారికి ఇచ్చేవారు. ఆయన విశ్వనాథ స్వామికి ఉత్తరం ఇస్తూ, "ఈ పల్లాకొత్తు సర్వాధికారి ఎవరు?" అని నవ్వుతూ అడిగారు. అప్పుడు హాలు చివర ఎక్కడో ఉన్న రామనాథ బ్రహ్మచారి లేచి నుంచుని, చేతులు కట్టుకుని, "వాళ్ళకు కావలసిన పనులు చేసి పెడతాను కాబట్టి వాళ్ళు నన్ను పల్లాకొత్తు సర్వాధికారి అని అంటారు. వాళ్ళు ఈ సేవలన్నీ చేయటానికి అనుమతించి, దానిని ఆమోదిస్తూ అంగీకారంగా, నన్ను పల్లాకొత్తు సర్వాధికారి అని పిలుస్తారండి", అని చెప్పారు. భగవాన్ ఎంతో సంతోషంతో, "నిజమైన సర్వాధికారి ఇలా ఉండాలి" అన్నారు.

మరొక సందర్భంలో పొడవుగా, దృఢంగా ఉండే దండపాణి స్వామి అనే ఆశ్రమవాసి, ప్రతివాళ్ళు తనకు అణిగిమణిగి ఉండాలనుకునే అతను, రామనాథ బ్రహ్మంతో తగాదా పెట్టుకున్నారు. బలహీనుడైనాగానీ, రామనాథ స్వామి కూడా ఏమాత్రం తగ్గలేదు. దండపాణిస్వామి రామనాథను క్రిందకు పడేటట్లుగా తోసి తన భుజబలం యొక్క దర్పంతో, "నేనెవరో తెలుసా నీకు?" అని అడిగాడు. రామనాథ బ్రహ్మచారి నేలపై పడి ఉండి, చేతులు జోడించి, వినయంగా, "దండపాణి స్వామీ! మనమందరం ఇక్కడకు వచ్చింది 'నేనెవరు?' అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకొనే ఉదాత్తమైన ఉద్దేశంతోనే కదా!" అన్నారు. "నేనెవరు?" అనే మాటలు వినగానే దండపాణి స్వామికి ఆవేశం దిగిపోయి, తన దురుసుతనానికి క్షమాపణ వేడుకొన్నారు. అప్పుడు వారిద్దరూ భగవాన్ వద్దకు వెళ్ళగా, దండపాణి స్వామి స్వయంగా జరిగినదంతా భగవాన్‌కు తెలిపారు. భగవాన్ నవ్వేశారు.

ఒక వ్యక్తి, లక్ష్మి అని భగవాన్‌చే పేరు పెట్టబడ్డ ఆవుదూడను ఆశ్రమంలో

ఉంచడానికి తీసుకుని వచ్చారు. అక్కడ లక్ష్మి బాగోగులు చూడడానికి ఎవరూ లేరు. చిరుతపులులూ, పెద్ద పులుల నుండి ప్రమాదం ఉంది. అందుకని ఇక్కడ ఉంచుకోలేము అని చెప్పారు భగవాన్. చిన్నగా, నాలుగున్నర అడుగులు ఎత్తు ఉండే రామనాథ, "భగవాన్! నేను లక్ష్మిని చూచుకుంటాను" అన్నారు. అప్పుడే రమణాశ్రమ గోశాల మొదలైంది.

తిరువణ్ణామలైకి, రైలు రోజూ రాత్రి ఎనిమిదిన్నరకు రావడంతో, బయట ఊళ్ళ నుండి వచ్చేవారు ఆశ్రమానికి వచ్చేటప్పటికి బాగా పొద్దు పోయేది. రమణాశ్రమంలో అందరూ ఏడు గంటల కల్లా రాత్రి భోజనం ముగించుకుని, ఏడున్నరకల్లా నిద్రించేవారు. భగవాన్‌కు రాత్రిపూట ఆలస్యంగా వచ్చే అతిథులను ఎవరైనా చూసుకుంటే బాగుండునని ఉండేది. కానీ, ఎవరూ ముందుకు రాలేదు. రామనాథ, "భగవాన్! వారిని నేను చూచుకుంటాను" అన్నారు. ప్రతి రాత్రీ ఆయన మేలుకుని ఉండి, అతిథుల అవసరాలను చూచుకునేవారు. మర్నాటి ఉదయం భగవాన్, రామనాథను చూచి నవ్వుతూ, "అయితే వారిని తీసుకొని వచ్చి, వారి అవసరాలను తీర్చావన్నమాట. మంచిది. మంచిది. మంచిది" అనేవారు.

ఒకరోజు భగవాన్, రామనాథతోను, మిగిలిన ఇతర భక్తులతోనూ కలిసి గిరిప్రదక్షిణ చేస్తున్నపుడు, ప్రతివారు ఒక ఆధ్యాత్మిక అంశంపై మాట్లాడవలసి వచ్చింది. రామనాథ భక్తి పారవశ్యంతో భగవాన్‌ను ఈశ్వరునితోనూ, ఆయన భక్తులను, శివుని భూతగణాలతోనూ పోల్చి చెప్పారు. తర్వాత భగవాన్ ఇతర భక్తులు కోరగా, తాను చెప్పిన దానిని తమిళ పద్యాలుగా వ్రాశారు. అందులో మొదటి పద్యం ఈ విధంగా ఉంది : "నేను తిరుచ్చుళి ఈశ్వరుని చూచి తిరిగి వచ్చే పని లేకుండా నిలచిపోయాను" దాని అర్థం ఏమిటంటే నేను సాక్షాత్కారం పొందాను.





నాకిక దేహభ్రాంతి లేదు. నా ప్రభువు నాకీ సాక్షాత్కారాన్ని అనుగ్రహించారు".

భగవాన్ యొక్క మంచి భక్తులలో ఒకరైన మా తల్లిగారు, రామనాథ బ్రహ్మచారిని ఎంతో ప్రేమగా చూసేవారు. "మురుగనార్, సాధుఓం, శివ ప్రకాశం పిళ్లై ఇతర భక్తులందరిలో ఎవరు వ్రాసిన పాట నీ కన్నీటి కంటే ఇష్టమైనది?" అని నేనామెను అడిగినపుడు, రామనాథ బ్రహ్మచారి వ్రాసిన గీతం నాకెంతో ఇష్టమైనది అని ఆమె అన్నారు. ఆ పాట భావమిలా ఉంటుంది. "నేను తిరుచ్చాళి నాధుణ్ణి చూశాను. వెనుదిరగలేక అక్కడే స్థిరపడి పోయాను. చిదంబరంలో నర్తిస్తూ నిస్సహాయులను కాపాడే నటరాజు ఆయనే. ఆ తిరుచ్చుళి నాధుడే పవిత్ర తిరువణ్ణామలైలోని కొండ మీద విరూపాక్ష గుహలో దైవమై వెలిసాడు. కాయాపురి (దేహము)లో కరణాలే (జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు) ప్రజలుగా, అహంకారమే మంత్రిగా అధర్మ పరిపాలన చేస్తున్నాడు. కొంతకాలం తర్వాత జీవుడు 'భగవంతుని అనుగ్రహము' అనే ఖడ్గమును తీసికొని, అహంకారమనే తన మంత్రి తలను నరికేశాడు. అలా మంత్రి తల త్రెంచి దహరాలయమనే గుహలో నాట్యము చేస్తున్న దేవునిలో ఐక్యమయ్యారు. ఆయనే ఈ తిరుచ్చుళి నాథన్. ఆయనను చూచిన నేను తిరిగి వెళ్ళలేక అక్కడే నిలిచి పోయాను. 1946లో రామనాథ బ్రహ్మచారి జబ్బుపడ్డారు. చికిత్స కోసం చెన్నై తీసుకొని వెళ్ళగా అక్కడ చనిపోయారు. ఆ వార్త భగవాన్‌కు చేరి ఆయన పూర్తి మౌనం వహించారు. ఆ 1946వ సంవత్సరములో అలా చాలా అరుదుగా జరిగేది. చుట్టూ వందలాది మంది ప్రజలున్నప్పటికీ ఆయన సమాధి నిష్ఠలో ఉండిపోయారు.

రామనాథ బ్రహ్మచారి వంటి భక్తులు, ఒక జ్ఞానిని మనమెలా ప్రేమించాలో, ఎలా ఆయనను అనుసరించి ఈ జన్మలోనే ముక్తులవవచ్చో తెలిసేటట్లు చేశారు.

# నాకెందుకు వజ్రపుటుంగరం?

**- 'వ్యక్తిత్వ వికాస కథలు' నుంచి**

ఒకప్పుడు ఒక సన్న్యాసి దట్టంగా చెట్లు పెరిగి ఉన్న ప్రదేశంలో తపశ్చర్యలు ఆచరిస్తూ వచ్చాడు.

ఇలా ఉండగా ఒక రోజు ఆ సన్న్యాసి సమీపంలో పారుతున్న ఏటిలో స్నానం చేసి నడిచి వస్తున్నాడు.

అప్పుడు దారిలో, ఆయన కూర్చుని ధ్యానం చేసే చోటుకు కాస్త దూరంలో, గడ్డి నేల మీద ఒక వజ్రపుటుంగరం ధగధగా మెరిసిపోతూ పడి ఉండడం ఆయన కంటపడింది.

వజ్రపుటుంగరం ఆయనకు అక్కర్లేదు, దాని పట్ల ఆయనకు అనురక్తి లేదు. కాబట్టి ఆయన గడ్డి నేల మీద పడి ఉన్న ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకోలేదు.

తరువాత ఆయన కళ్ళు మూసుకొని ధ్యానంలో నిమగ్నుడయ్యాడు.

కళ్ళు మూసుకొన్న స్థితిలో ఆయనకు సమీపంలోని గడ్డి నేల మీద ఏదో శబ్దం వినిపించింది.

అప్పుడు ఆ సన్న్యాసి, 'ఎవరో వస్తున్నారు. ఆ వ్యక్తి ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకోని' అని అనుకున్నాడు.

అడుగుల చప్పుడు కాస్త దూరంలో వినరాగానే, 'వచ్చిన వ్యక్తి వెళ్ళిపోయాడు' అనుకుని, ఆ సన్న్యాసి కళ్ళు తెరచి చూశాడు.

చూడగా, వెళ్ళినది మనిషి కాదు-అదొక పశువు!

ఈ విధంగా ఆ రోజు అడుగుల శబ్దం విన్నప్పుడల్లా ఆ సన్న్యాసి, 'ఎవరో వ్యక్తి వస్తున్నాడు ... అతడు ఆ వజ్రపుటుంగరాన్ని తీసుకోని!' అని అనుకో సాగాడు.

అక్కణ్ణుండి ఆ వ్యక్తి వెళ్ళిపోయాడని శబ్దాన్ని బట్టి ఊహించి, 'వచ్చిన వ్యక్తి వజ్రపుటుంగరాన్ని తీసుకొన్నాడా?" అని కళ్ళు తెరిచి చూశాడు.





ఈ అనుభవం ఆ సన్న్యాసికి మొదటి రోజు నాలుగైదుసార్లు కలిగింది. ఆ రోజు ఆ దారిలో వెళ్ళిన నలుగురైదుగురు వ్యక్తులూ వజ్రపుటుంగరాన్ని తీసుకోకుండానే తమ దారిన వెళ్ళిపోయారు.

రెండవ రోజూ ఆ దారిగుండా వెళ్ళిన నలుగురైదుగురు వ్యక్తులు కూడా వజ్రపుటుంగరాన్ని తీసుకోకుండానే తమ దారిన వెళ్ళిపోయారు.

మూడవ రోజు సన్న్యాసి ఎవరో వ్యక్తి వస్తున్న అడుగుల శబ్దం విని కళ్ళు తెరిచి చూశాడు. అప్పుడు వృద్ధుడైన ఒక రజకుడు వీపు మీద బట్టల మూటను మోసు కుంటూ రావడం సన్న్యాసికి కనిపించింది. అతడికి వృద్ధాప్యం కారణంగా గూని ఏర్పడింది. కాబట్టి అతడు వంగి నేలను చూస్తున్నట్లే నడిచి వస్తున్నాడు.

తన సమీపంలోకి వచ్చిన ఆ రజకునితో సన్న్యాసి, "అదుగో చూడండి! మీరు వస్తున్న దారిలో ఒక వజ్రపుటుంగరం! దాన్ని మీరు తీసుకోండి!" అని చెప్పాడు.

అందుకు ఆ వృద్ధుడైన రజకుడు, "నేను వస్తున్న దారిలో గత మూడు రోజులుగా ఆ వజ్రపుటుంగరాన్ని చూస్తూనే ఉన్నాను స్వామీ!

నేను నా శ్రమతోనే జీవించాలని అభిలషిస్తున్నాను. శ్రమ పడకుండా అయాచితంగా లభించే ఈ వజ్రపుటుంగరం నాకు అక్కర్లేదు. శ్రమించ కుండా లభించేది ఏదీ నాకు అవసరం లేదు. నాకెందుకు వజ్రపు టుంగరం?" అని జవాబిచ్చాడు.

ఆ దారిలో కొందరు వ్యక్తులు వెళ్ళనే వెళ్ళారు. కాని వారిలో ఏ ఒక్కరూ ఈ వజ్రపుటుంగరాన్ని చూడకపోవడంతో దాన్ని తీసుకోలేదు. మూడు రోజులుగా వజ్రపుటుంగరాన్ని చూస్తున్న ఆ రజకుడు, 'ఇతరులకు సొంతమైన ఏదీ నాకు అక్కర్లేదు. ఉచితంగా లభించేది ఏదీ నాకు వద్దు. నా శ్రమను నమ్ముకునే జీవిస్తాను' అని అన్నాడు.

జనులు తమ శ్రమతోనే జీవితం గడపాలి. శ్రమించకుండా తిని కూర్చోవడం దొంగతనంతో సమానమని పై ఉదంతంలోని రజకుడు మనకు చెప్పకయే చెబుతున్నాడు.

# రాణి రుద్రమదేవి

- ఐతా చంద్రయ్య

## జననము-బాల్యము

గణపతిదేవ మహారాజుకు ముగ్గురు భార్యలు. వారిలో సోమలదేవి పెద్ద భార్య. సోమలదేవి గణపతిదేవ దంపతులకు కూతురు జన్మించింది. గణపతి దేవుని పెదతండ్రిగారైన రుద్రదేవ మహారాజు వీరత్వానికి గుర్తుగా ఆమెకు రుద్రమదేవి అని పేరు పెట్టారు. ఆమె జన్మించిన నక్షత్రము, జాతక చక్రము గొప్పగా ఉందన్నారు జ్యోతిష్యులు. ఆమె వల్ల కాకతీయ సామ్రాజ్యము గౌరవ ప్రతిష్ఠలు ఎన్నో రెట్లు పెరుగుతాయన్నారు. గణపతి దేవునికి గణపాంబ అనే మరో కూతురు ఉండేది. మగ సంతానము లేదు. దానికి గణపతి దేవుడు బాధపడలేదు. రుద్రమదేవిని రుద్రదేవ మహారాజా అని పిలుచుకునేవాడు. ఆమెనే కుమారుడుగా భావించి పురుష వేషము ధరింపజేసేవారు. ప్రజలు గూడా రుద్రదేవ మహారాజనే పిలిచేవారు.

పూవు పుట్టగానే పరిమళించు నన్నట్టు చిన్నారి రుద్రమ పసితనము లోనే ధైర్య సాహసాలు ప్రదర్శించేది. ఆటపాటల్లో మేటి అనిపించుకునేది. ఆటల్లో నాయకురాలిగా ఉండేది.

తండ్రి తాతలు వీరోచితముగా చేసిన గొప్ప పనులను వింటూ తానూ వారి బాటలో నడవాలనుకునేది. బాల్యంలోనే యుద్ధమన్నా, సాహస కార్యాలన్నా మక్కువ చూపేది. రామాయణ, భారత, భాగవత కథల్ని ఆసక్తిగా వినేది. చిన్నప్పడే బంతి ఆడుతూ శివధనుస్సును తీసి పక్కనబెట్టిన సీతా దేవి సాహసాన్ని విని తాను గూడా వీరవనిత కావాలనుకున్నది.

## విద్యాభ్యాసం

తండ్రి గణపతిదేవ మహారాజు కొలువులో మంత్రియైన శివదేవయ్య ఆమె గురువు. అతడే చిన్నారి రుద్రమ చేత అక్షరాలు దిద్దించాడు. సాధారణ యుద్ధ విద్యలు నేర్పించాడు. సైన్యాలను నడిపించడం, వ్యూహాలు పన్నడం,





శత్రురాజుల ఎత్తులకు పై ఎత్తులు వెయ్యడం, శత్రువుల బలగాల వ్యూహాలను ఛేదించడం మొదలైనవన్నీ స్వయంగా నేర్పించాడు. వాటితోపాటు రాజనీతి శాస్త్రము, అర్థ శాస్త్రము, శిక్షా పద్ధతులను, రాజ్యపాలనా రీతులను బోధించాడు.

రుద్రమదేవి మేనమామ జాయప సేనాని నాట్య శాస్త్ర పారంగతుడు. అతని వద్ద నాట్యరీతులు నేర్చుకుంది. కొంకణభట్టు సంగీత, సాహిత్యాల్లోని లోతుపాతుల్ని, కళారీతుల్లోని రహస్యాలను అర్థమయ్యేలా బోధించాడు.

గణపతిదేవ మహారాజు స్వయంగా పూనుకుని రాజతంత్రాన్ని నేర్పాడు. కొలువులో తన పక్కన కూచోబెట్టుకుని పరిపాలన, శిక్షాస్మృతిలోని మెలకువలను నేర్పాడు. యుద్ధానికి వెళ్ళేప్పడు రుద్రమదేవిని వెంట తీసుకెళ్ళే వాడు. యుద్ధ ప్రక్రియలను ప్రత్యక్షముగా చూపించేవాడు. ఫలితంగా రుద్రమదేవి యుద్ధ విద్యా పారంగతురాలైంది. ఆమె తానో స్త్రీననీ, అబల ననీ ఎప్పడూ భావించలేదు. మగధీరునిలా దుస్తులు ధరించి రాకుమారుడిలా తిరుగుతుండేది.

## శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము
## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

(గత సంచిక తరువాయి)

తే.గీ. ఎడమ తొడపైన కుడికాలు, ఎడమ చేతి
వ్రేళ్లను కుడికాలి బొటన వ్రేలి మీద
నమర జేయుచు కూర్చున్న యతని మూర్తి
పొంద మనుచున్న యనుభూతి బోధ గనుము 5

తే.గీ. చర్య చర్య నందొక బోధ సాయినాథు
దెలియ జేయుచు భక్తుల దీప్త జేయు

కనగ నహము విడచి, కుడి కాలి బొటన
వ్రేలు, సాయి శక్తిని పొంద వీలు కలుగు 6

ఆ.వె. నీదు అహము విడచి, నీ సంపదల గర్వ
మిడచి, గొప్ప దనము విడచి, నీదు
భాగ్యమలర సాయి భక్తుడవైనచో
చింత లేక సాగు జీవితంబు 7

తే.గీ. బాబ పాదాల సాష్టాంగ బడగ నీదు
అహము విడిపోవు గర్వమున్నడగు నోయి
శక్తి పాతము నీకగు స్పర్శ వలన
సాయి సద్గురు కల్గించు సకల శుభము 8

ఆ.వె. చిత్ర మగును సాయి చేతలర్ధముగావు
బోధ గలుగ జేయు విధము గనగ
వివిధ రకములుండు విపరీతమనిపించు
తెలివి తేటలు మనవి తేల్చ లేవు 9

తే.గీ. దీర్ఘ మౌనంబు చైతన్య దీప్తులున్న
భక్త పరివేష్టితుండగు బాబ సాయి
కధలు గాధలు జెప్పచు బోధ జేయు
కోపతాపాలు ప్రకటించు కోర్కెదీర్చు 10

ఆ.వె. నమ్మి కొలువ నీదు నట్టింటి దీపంబు
కాదు కూడ దన్న ఖర్మ నీదు
పాము కాటు నుంచి భక్త మిరికరుని
గాచె, భుట్టి జాతకమును మార్చె 11

ఆ.వె. సాయి నాజ్ఞ వినని సాధు సమీరు శ
క్కరుని కాపదొచ్చె, కలిగి బుద్ధి
సాయి శరణు నొంద, సర్ప కాటును దప్పె





దీర్ఘ రోగమున్న దీరెనతని 12

ఆ.వె. ఆత్మ రూపు డగచు అన్ని జీవులలోన
అలరి యుండు సాయి ఆపదలను
కలుగ నీయకుండ కాపాడు భక్తుల
ఆశ్రయించు మోయి యతని పదము 13

## 27. "అల్లా మాలిక్" అనుచును

కం. మనుజుడు త్రిగుణాతీతుడు
తను కాయం బనుకొనగనె తగులున్ మాయన్
తన మాయను ఛేదించగ
తన మనముల గురుని సేవ తరియించ వలెన్ 1

కం. అవతార పురుషుడగు సా
యి వచించగ లేదు తాను యీశ్వరుడనుచున్
అవనిన సుఖముగ నుండగ
భవమును దాటంగ బాట బాబా చూపున్ 2

కం. "అల్లా మాలిక్" అనుచును
ఎల్లప్పడు పలుకుచుండు ఎడతెగకుండన్
ఎల్లరి మన్నన జేయును
అల్లరి జేయడు తనకిది యది తెమ్మంచున్ 3

ఆ.వె. యోగ శాస్త్ర గ్రంధ మోపినంత జదివి
శిరిడి జేరె నొకడు సిద్ధినొంద
"ఉల్లి రొట్టె తినెడి" ఉట్టికెగురలేని
యితడు నేర్ప గలడె విద్య నాకు? 4

**(సశేషం)**

**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

'మహారాజా! నీవు ధర్మదర్శివి. రాజు, సుక్షత్రియుడు దురాచారాలను ప్రోత్సహించవచ్చా? దుష్టులను మన్నించవచ్చా?'

'కృష్ణా! ఉచితానుచితాలు ఆలోచించే సమయం మీరిపోయింది. గతాన్ని త్రవ్వుకోడం దేనికి? ఈ పదమూడేండ్లూ గడవాలి. అదే నాకు ప్రాయశ్చిత్తం. ఆ తరువాత ఎలాగూ పోరు తప్పదు'

కృష్ణుని ముఖం జేవురించింది. ఆ ముఖముద్రను చూచి అందరూ స్తంభించి పోయినారు. అర్జునుడు ప్రక్కన చేరి వీపున చేయివేసి శాంతింపజేశాడు.

'ధర్మరాజా! రాజసూయ మహాధ్వరంలో నన్ను ముందుంచి భీష్ముని లాంటి కురువృద్ధుల సమక్షంలో, వారి ప్రేరణతోనూ నిన్ను చక్రవర్తి సార్వభౌమునిగా యావద్భారతం అభిషేకించింది. అలా అవబృథస్నానం చేసిన నీవే కురుకుల చక్రవర్తివి. ధర్మరాజ్యస్థాపనమొక్కటే నా లక్ష్యం. నా తపన, దానికై మీరు కేంద్రంగా, ప్రతినిధులుగా నిలుస్తారని ఆశించాను. వేదవ్యాస మహామునీంద్రులకూ అదే ఆశ కలిగింది. ఆ ఆశలు వృథా కారాదు. మహారాజా! ఈ సమస్త రాజన్యలోకం, నేనూ మీ వెంట ఉన్నాం. భీమార్జున, నకుల, సహదేవుల క్రోధాగ్నులలో మా అందరి నేతృత్వంలో కౌరవులు వారిని సమర్థించిన వారందరూ సమిధలై భస్మీభూతులవుతారు. వారి మరణం నిశ్చయమయ్యే ఉన్నది. కురు చక్రవర్తీ! నీవు మాట తప్పవు. నీ మాట ప్రకారమే కానీయండి, ఈ పదమూడేండ్ల తరువాత కౌరవ రక్త పంకిలంలోంచి పాండవ పద్మాలు వికసిస్తాయి. ధర్మం సహస్ర కిరణాలతో సూర్యునిలా దిక్కులను ఆలోకితం చేస్తుంది".





కృష్ణుడు మాట్లాడుతున్నప్పుడు ఒక దివ్యతేజం ఆయన ముఖాన కనిపించింది. ద్రౌపది వారిద్దరి స్వరూపాలను చూడగానే దుఃఖ ముప్పొంగింది. ఆ దుఃఖావేశాన్ని ఆపుకోలేక సుభద్రా, సత్యభామల కౌగిళ్లను విదిల్చి లేచింది. ఆమె కనుల ముందు కౌరవ సభ అవతరించింది. దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణులు కనిపించారు.

'ప్రభూ! వాసుదేవా! ఒక్క క్షణం నా గతి చూడు. రాజసూయంలో అవబృథస్నానం చేసిన దాన్ని నేను. దిగంతకీర్తులని పేరుపొందిన పాండవుల పట్టమహిషిని. దృష్టద్యుమ్ననితోపాటు యజ్ఞఫలంగా జన్మించిన దాన్ని. సాక్షాత్తు వాసుదేవుని శరణు పొందిన దాన్ని. ద్రుపద మహారాజు కూతుర్ని. పాండు చక్రవర్తి కోడల్ని. నన్ను - నన్ను - ఆ దుర్యోధన, దుశ్శాసనులు అనని మాట లేదు. సభలోకి కొంగు పట్టి ఈడ్చి తెచ్చారు. ఆ పశువులకు నేను దాసినటయ్యా! అక్కడే చెట్టంత భీష్ముడు, చాపాచార్యుడంటారే ఆ ద్రోణాచార్యుడు - ఇంకా ఎందరో ఉన్నారు. కానీ ఒక్కరూ - ఏ ఒక్కడూ నోరు విప్పలేదు. నాలుక కదల్చలేదు. మహావృక్షాలను పెకలించి వందమంది రాక్షసులను మట్టుపెట్టగల భీమ పరాక్రమం దేనికి? రాజసూయాన్ని నిర్వహించారు గనుక ఆ యుధిష్ఠిరుల వారు పృథ్వికి చక్రవర్తియట! ఎందుకీ బిరుదులు కేశవా! నిండు సభలో భార్యను ఒక అబలను ఈడ్చి తెస్తుంటే అలా శిలాప్రతిమల్లా నిల్చుండిపోయిన వీరి వెర్రి విక్రమాన్ని, పౌరుషాన్ని ఏమనాలి ప్రభూ! అప్పుడు ఎవరయ్యా నాకు దిక్కైంది! నా మానాన్ని కాపాడింది ఎవరయ్యా! భార్యను కాపాడుకోలేని ధర్మమూ ఒక ధర్మమేనటయ్యా. స్త్రీని కాపాడడం క్షత్రియధర్మం కాదా?'

ద్రౌపది దుఃఖం కట్టలొలిసింది. అలా కన్నీరు కారుస్తూ కృష్ణుని పాదాల చెంత వాడిన పూలచెండులా పడిపోయింది. సత్యభామ, సుభద్రా పరుగున వచ్చి ఆమెను ఆదుకున్నారు. కృష్ణుని కనులలోని వేడి అశ్రుధారలు పొంగాయి. ఆమెను రెండు చేతులా పైకెత్తి, శిరస్సును మూర్కొని, కన్నీరు

తుడిచి, 'సోదరీ! కొంతకాలం ఈ దుఃఖాన్ని గరళంలా గొంతులో దాచుకోక తప్పదు తల్లీ! ధర్మరాజు నేడు ధర్మానికి గీచిన గీత, ప్రపంచమంతా ఆయనను పరీక్షిస్తున్నది. ఈ పరీక్షలో నెగ్గి ఆయన కురుకుల సార్వభౌము డవుతాడు. ఆనాడు అతని ఫాలాన సంహరించిన పాపుల రక్తంతో వీర తిలకాన్ని దిద్దుదువు గాని, అంతవరకు ఓపిక తప్పదు. నేను నీకు మాట నిస్తున్నాను. సముద్రాలింకిపోవచ్చు. హిమాలయాలు పూర్తిగా కరిగి ప్రవహించవచ్చు. సూర్యచంద్రులు గతి తప్పవచ్చు. నా మాట మాత్రం తప్పదమ్మా. ఆతతాయుల సంహారం, సాధుసంక్షేమం తప్పక జరుగుతుంది. నీ ధైర్యమే ఈ ఐదుగురిలోని క్షాత్రాగ్ని శిఖ ఆరిపోకుండా కాపాడ గలుగుతుంది' అని ఓదార్చాడు.

తర్వాత ధర్మరాజు నుద్దేశించి 'మహారాజా! మన ప్రాచీన శాస్త్రాల ననుసరించి ఒక రోజంటే సంవత్సరంగా అన్వయించవచ్చు. వారు కోరినట్లు నేటికి పదమూడు రోజులు గడిచాయి. మరి ఆ లెక్క ప్రకారం పదమూడేండ్లూ గడిచినట్లు భావించి హస్తినపై దాడి చేయడం ధర్మమే కదా! నీవు అనుమతిస్తే చాలు'నన్నాడు కృష్ణుడు.

ధర్మరాజు చిరునవ్వుతో మౌనంగా ఉన్నాడు.

'అవును నీవు మాట తప్పవు. ధర్మరాజా, నీవు నిజంగా ధన్యుడివయ్యా' అని కృష్ణుడు యుధిష్ఠిరుని పాదాలకు నమస్కరించాడు. ధర్మరాజు శ్రీకృష్ణుణ్ణి తన కౌగిట పొదువుకున్నాడు. ఇద్దరూ ఇలా ఒకరిలో ఒకరు కరిగిపోయి ఉండడం చూస్తూ అందరి కళ్లూ చెమ్మగిల్లాయి. ప్రకృతి కూడా ద్రవించింది.


క్షణంపాటు చేతనా చేతనాలు స్తంభించిపోయాయి.

తరువాత శ్రీకృష్ణుడు 'యుధిష్ఠిర మహారాజా! నేను సాల్వుణ్ణి వధించ డానికి సౌభరాజ్యం మీదికి వెళ్లాను. శిశుపాలుణ్ణి చంపిన వెంటనే, అతని మిత్రమండలి సభలోంచి నిష్క్రమించింది నీకు తెలుసు కదా!

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

ఎక్కడికయినా వెళ్లాలని దాసగణు అనుమతి కోరినా, **"చూద్దాంలే"** అంటూ, బాబా నెలల తరబడి ఆ విషయాన్ని దాటవేసేవారు. ఆ విధంగా దాసగణు ఒకసారి శిరిడీ వచ్చాడంటే, బాబా తనను రెండు, మూడు నెలలు శిరిడీ నుండి కదలనిచ్చేవారు కారు. అలా ఒకసారి శిరిడీలో నున్న సందర్భంలో, ఒక విశేష పర్వదినం రోజు, దగ్గరలోని పుంతాంబ గ్రామం లోని గోదావరిలో పుణ్యస్నానం చేయాలని దాసగణు అభిలషించాడు. అదే విషయాన్ని బాబాకు నివేదించి అనుమతిని అర్థిస్తే, బాబా యథా ప్రకారం **"రేపు చూద్దాం, ఎల్లుండి చూద్దాం"** అని అంటూ దాటవేయసాగారు. బాబాను ఆ విషయం గురించి అడగడం, బాబా **"చూద్దాంలే"** అని చెప్పడం అనే ప్రక్రియ ప్రతిరోజూ జరుగుతూనే ఉంది. ఒక ప్రక్కమో విశేష పర్వదినం, ఇంకొక ప్రక్కమో నాలుగు క్రోసుల దూరంలో పుంతాంబ గ్రామంలో గోదావరీ తీరం. కానీ, బాబా వెళ్లనివ్వడం లేదు. అందువలన దాసగణు మనసులో ప్రతికూల భావాలు చోటు చేసుకోసాగాయి. "ఈయన ఏం మహాత్ముడు? విశేష పర్వదినం రోజు కూడా పవిత్ర గోదావరీ నదిలో స్నానం చేయనివ్వడు. ఈయనకు ఆ విలువ తెలిసినట్టు లేదు" అనే ఆలోచనలతో మనసు తీవ్ర అసంతృప్తికి లోనవసాగింది. ఆ విధంగా దాసగణు తీవ్రంగా మనసులో మదనపడసాగాడు. ఇక మరుసటి రోజు ఆ పర్వదినం అనంగా, దాసగణు మరలా వెళ్లి బాబాను బాబా రేపే ఆ పర్వదినం. "మీరు అనుమతిస్తే రేపు తెల్లవారుఝామున బయలు దేరుతాను" అని బాబా అనుజ్ఞను అర్థించాడు.

భావం లోపలి భావానికి ఆధారమైన విభుడు, సర్వజీవుల హృదయా లలో వసించే పరమాత్ముడు అయిన ఆ సద్గురు నాథునికి దాసగణు

హృదయంలోని మదనం తెలియనిదా! అప్పుడు బాబా ఎంతో అనునయంగా **"అంత ఆందోళన ఎందుకురా గణూ! రేపటి రోజు గోదావరి స్నానంలో ఏమయినా ఎక్కువ దొరుకుతుందా? తుకారాంబువ గుమ్మడికాయల కథ నీకు తెలుసు కదా! లోపల స్వచ్ఛంగా ఉండాలి. వట్టి చర్మాన్ని తడిపితే ఏమొస్తుంది? అదే చేసి అంతటితో ఊరుకుంటే సరిపోతుందా? పండుగ రోజులలో మాత్రమే గోదావరి కావాలా? మిగిలిన రోజులలో వద్దా? ఆ గోదావరి ఎల్లప్పుడు మన వద్దనే ఉండాలి. మన వద్దనే ఉంది కూడా! నీవు ఊరకనే మదన పడవద్దు"** అని దాసగణుకు హిత(సత్య)బోధ చేసి ఊరడించారు. బాబా ముఖతః ఎంతో హృద్యంగా వెలువడిన ఆ మాటలకు దాసగణు ఇంకేమి మాట్లాడలేకపోయాడు. అలా అని పూర్తిగా సమాధానపడలేకపోయాడు. సాక్షాత్తూ ఆ సద్గురునాథుడే అటువంటి సత్యబోధను చేసినప్పటికీ దాసగణు వంటి పారమార్థిక జ్ఞాని సమాధానం చెందలేకపోయాడంటే మనసు కలిగించే మరపు ఎంతటి పరిణామాన్ని చూపిస్తుందో మనం గ్రహించవచ్చు.

ఇక గోదావరీ స్నానం గురించి పూర్తిగా ఆశలు వదిలేసుకున్న దాసగణు, మరుసటి రోజు కలత చెందిన మనసుతో బాబా దర్శనానికై మసీదుకు వెళ్ళాడు. దాసగణు ముఖంలో ప్రస్ఫుటమవుతున్న బాధను బాబా గమనిస్తూనే ఉన్నారు. బాబా చరణాలపై శిరస్సు నుంచి ప్రణమిల్లుతున్న దాసగణు చెవులకు ఏదో జలజల పారుతున్న శబ్దం వినపడుతుంది. నుదుటికి ఏదో తడి తగులుతున్నట్లుగా భావన కలిగింది. ఒకింత అయోమయంతో తలెత్తి చూసిన దాసగణుకు, బాబా యొక్క రెండు పాదాల బొటనవ్రేళ్ళ నుండి సన్నని ధారగా నీరు ప్రవహిస్తున్న దృశ్యం కంటపడింది. సంభ్రమాశ్చర్యాలతో తన కళ్ళను తానే నమ్మలేని స్థితిలో, అద్భుతమైన రీతిలో బాబా చరణాల నుండి ప్రవహిస్తున్న ఆ నీటిని దోసిళ్ళతో చేతుల్లోకి తీసు





కొన్నాడు. **"ఏం గణూ, సమాధానపడ్డావా?"** అని బాబా అడగడంతో, దాసగణు యొక్క హృదయమనే కడలిలో ఉద్విగ్న భావాలు అనే కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తెలియని తన్మయత్వం తనువంతా ఆవరించింది. వసంతం ఆవరించిన వనాన్ని చూసి మురిసిన కోయిల అప్రయత్నంగా గానం చేసినట్లు, అపూర్వమైన బాబా దివ్య లీలను ప్రత్యక్షంగా అనుభవించి, తనువంతా పారవశ్యం ఆవరించిన దాసగణు నుండి హృదయంలో ఉప్పొంగిన భక్తిభావంతో అసంకల్పితంగా కవిత రూపంలో వెలువడింది.

అగాధశక్తి అఘటిత లీలా తవ్ సద్గురురాయా!
జడజీవాతే భవి తరాయా తూ నౌకా సదాయా!
వేణుమాధవ్ ఆపణ్ హెూవున్ ప్రయాగ్ పద్ కేలే!
ద్వయ అంగుష్టీ గంగా యమునా ప్రవాహా దాఖివిలే!
కమలోద్భవ్ కమలాకర్ శివ్‌హర్ త్రిగుణాత్మక మూర్తి!
తూచ్ హెూవునీ సాయిసమర్థా విచార్‌సీ భూవర్‌తీ!
ఏసే అస్‌తా ఉగీచ్ మన్మన్ భట్‌కత్ హే ఫిర్‌తే!
అలా వినంతీ హీచ్ తులా గా స్థిర్ కర్‌ణే త్యాతే!
అధమాధమ మీ మహాపాతకీ శరణ్ తుజ్యా పాయా!
ఆలో నివాటా దాసగణుచే త్రితాప్ గురురాయా!

(భావం :- ఓ సదుశ్ర రాయా! నీ అగాధ శక్తి, అఘటిత లీలలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. నీ సామర్థ్యం అనంతం! ఈ పృథ్విపై జడ మరియు జీవులను ఉద్ధరించడానికి, భవసాగరాన్ని దాటడానికి అవసరమైన నౌకవు నీవు!

నీవు ప్రయాగ క్షేత్రంలోని వేణుమాధవుడవు! వేణుమాధవుని చరణం ఏ విధంగానయితే త్రివేణి సంగమంలోని పవిత్ర జలాన్ని ప్రవహింప జేస్తుందో, అదే విధంగా ఓ సాయిదేవా! నీ చరణాలు కూడా పవిత్ర త్రివేణి జలాన్ని ప్రవహింపజేస్తాయి. నీ పాదాల బొటన వేళ్ళ నుండి గంగా, యమున నీటిని ప్రవహింపజేసి చూపించావు!

**(సశేషం)**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

ప్రేమ స్వరూపియైన వ్యక్తి చెడు కర్మలు చేయలేడు. కర్మలంటవు, అందుచేత ముక్తికి అర్హుడు.

ప్రేమ దైవగుణం, ప్రేమే దైవం, దైవమే ప్రేమ అన్నారు శ్రీ సత్యసాయి బాబా. లవ్ ఈజ్ గాడ్, గాడ్ ఈజ్ లవ్. మోహానికి, ప్రేమకి తేడా తెలుసు కుందాం. మోహం మనల్ని బంధిస్తుంది. వస్తు మోహం, మనుష్యుల మోహం, జంతువుల మోహం. ఉదా : కుక్కలు, పిల్లులు మొ.నవి. మోహం రక్త సంబంధీకులను అంటే పిల్లలను, తోడబుట్టిన వాళ్లను, తల్లిదండ్రులను గట్టిగా బంధిస్తుంది. ఈ మోహంలోపడి వాళ్ల సుఖాల కోసం చెడు కర్మలు అనివార్యంగా చేస్తాం. అబద్ధం, మోసం, అన్యాయం మొదలైనవి చేస్తాం.

ప్రేమ అట్లా గాదు. ప్రేమతో మనం ఇతరుల్ని బంధింపవచ్చు. కానీ, మనం బంధింపబడం. ప్రేమలో త్యాగం, ఇవ్వటమే ప్రధానంగా ఉంటుంది. ఏ ప్రతిఫలాన్ని ఆశించదు, తీసుకోదు. అవతలి వ్యక్తి సంతోషాన్ని, అభివృద్ధిని, ఆరోగ్యాన్ని కోరుకుంటుంది. అతను ద్వేషించినా ప్రేమ అతనిని ఎన్నటికి ద్వేషించదు. తల్లి ప్రేమ అలాంటిదే. పోనీలే నా బిడ్డే గదా, అంటే అన్నాడులే, నన్నే కదా, ఫరవాలేదు అంటుంది తల్లి. ప్రేమకు కండీషన్స్ ఉండవు. నువ్వు ప్రేమిస్తే నేను ప్రేమిస్తాను అనే భావన ఉండదు. అన్‌కండీషనల్ ఇర్రెస్‌పెక్టివ్ ఆఫ్ సిట్యుయేషన్స్, బిహేవియర్ ఆఫ్ అదర్ పర్సన్, స్టిల్ ఉయ్ లవ్, అది ప్రేమ. భగవంతుని ప్రేమ మన పట్ల అలాంటిదే. మనం ఎన్ని తప్పులు చేసినా ఆయన మనల్ని ప్రేమిస్తూనే ఉంటాడు.

మనిషి ఉన్నత స్థితికి పోవాలంటే భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను మర్చిపోవాలి.





ఈ శరీరంతో మమేక భావం ఉండకూడదు. అంటే శరీరంపై ప్రేమ, నా శరీరం అనే భావన పోవాలి. క్షణక్షణం శరీరంలో అణువులు మారుతూనే ఉంటాయి. అలాగే క్షణక్షణం మనస్సు మారుతూనే ఉంటుంది, నిలకడగా ఉండదు.

ఈ మారేవన్నీ నశించేవే. అందుకే సత్య దృష్టి అలవర్చుకోవాలి. మారనిది, నిత్య సత్యమైనది ఆత్మ ఒక్కటే అని తెలుసుకొని, దాని దర్శనం కోసం తాపత్రయపడాలి. అదే ప్రతి మనిషి జీవితాశయం కావాలి. ఈ ప్రపంచం మాయ, మాయ మనల్ని బంధించకుండా జాగ్రత్తపడాలి. స్వార్థాన్ని త్యజించాలి. ఈ మిధ్యా వ్యక్తిత్వం క్షీణించే కొద్దీ సత్యావ్యక్తిత్వం వ్యక్తమవుతుంది.

మీ బుద్ధిని అత్యుత్తమమైన ఆలోచనలతో, అత్యుత్తమమైన సంకల్పంతో నింపండి. రేయింబవళ్ళు దానిని అభివృద్ధి చేయండి. దాని ఫలితంగా అత్యుత్తమ కార్యాలు చేస్తారు. ఉన్నత స్థితికి చేరుతారు.

మీ ఆధ్యాత్మిక ప్రగతికి కొలత ప్రేమ. మీలో ప్రేమ ఉత్పన్నమైనప్పుడు ఆధ్యాత్మికత మార్గంలో ఉన్నట్లే. ప్రేమ మరింత శక్తినిస్తుంది.

మనిషికి ఆధ్యాత్మిక ప్రగతికి ఒకటి నిస్వార్థ సేవ లేక నిష్కామ కర్మ. రెండవది ధ్యానం. ఈ రెండూ ప్రధానమే.

భగవంతుడు అన్నిటా ఉన్నాడనుకోవడం జ్ఞానం, మరెక్కడో ఉన్నాడను కోవడం అజ్ఞానం.

సాధారణంగా మన మనస్సు పవిత్రంగా ఉందా, మరింత ఉన్నతంగా మారిందా అని ప్రశ్నించుకోము. కేవలం పని ప్రతిఫలం కోసమే ఎదురుచూస్తాం.

జ్ఞానం కావాలనుకొన్నప్పుడు ఇంద్రియ సుఖాలను విడిచిపెట్టాలి.

పూర్వజన్మలో చేసిన పాపాలు క్షీణిస్తే కాని ఆత్మానుభవం కలగదు. విస్తారమైన పుణ్యం సంపాదిస్తే పాపాలు పోతాయి. దీనికి పుణ్యచింతన

ఉండాలి.

ఈ విశ్వంలో పరిపూర్ణమైన వస్తువేది? అని భృగువు తండ్రియైన వరుణిని అడిగినప్పుడు తపస్సు చేసి కనుక్కో అంటాడు. ఎందుకంటే స్వానుభవం ద్వారానే తెలుసుకొంటే శాశ్వత విశ్వాసం ఉంటుంది.

దేహమని చెప్తే కాదు తపస్సు చేయి అంటాడు. అటు పిదప, ప్రాణమని, మనస్సని, విజ్ఞానమని చివరకు ఆనందమని భృగువు తెలుసుకొంటాడు.

మనస్సు ఉన్నంత వరకు ఆశలుంటాయి. ఆశలు పోవాలంటే మనస్సు పోవాలి.

జ్ఞానం అంటే ఏమిటి? బ్రహ్మపదార్థం తప్పించి ఈ ప్రపంచంలో ఏదీ లేదని స్వానుభవంతో తెలుసుకోవటమే.

పాపం తొలగటానికి భగవత్ ధ్యానమే మార్గం. మంచికి మంచి, చెడుకు చెడు ఫలితాలున్నాయని మనిషి తెలుసుకోవాలి. మనం ఆధ్యాత్మిక ప్రగతిలో ఉన్నాం అని ఎలా తెలుస్తుంది? మన ఆధ్యాత్మిక ప్రగతికి అసలైన కొలత మనలోని మార్పు. మనలో మార్పు, ఆలోచనలో, మాటలలో, పనులలో మంచి మార్పు వేగంగా వస్తే, అప్పుడు మనలో స్వచ్ఛమైన ప్రేమ, కరుణ, దానం, సేవ, దయ, సహనం అనే గుణాలు వృద్ధి చెంది మన భావాల్ని శుద్ధి చేసి, పవిత్రతను పెంపొందిస్తాయి. భావశుద్ధియే మనస్సుకు శుద్ధి. ఇవన్నీ మనం గురువు ద్వారా లేక జ్ఞానుల ద్వారా విన్నది, ఆచరణలో పెట్టి స్వానుభవం పొందినప్పుడే మన జీన్స్‌లో ఉన్న పొరలలోని రిసెప్టర్స్ ద్వారా సమాచారం చేరవేసి తదనుగుణంగా భావాలు తయారుచేసి, మనల్ని కంట్రోల్ చేస్తుంది. కాబట్టి బయటి వ్యక్తులు, పరిసరాలు, టీవీ సినిమాలు, అంతర్జాలాల ద్వారా ఎటువంటి భావాలు తీసుకుంటామనేది ముఖ్యం. ఎక్కువగా టీవీ, సినిమాలు, పరిసరాలు అంతర్జాలాలలో నెగిటివ్ భావాలు ఉంటాయి. ఈ భావాలకి మీరు దూరంగా ఉండండి.

**(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

**శ్రీ కోదండరామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ**

శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శన కార్యక్రమం జనవరి 9, 10 తేదీలలో సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగినది.

జనవరి 8వ తేదీ సాయంత్రానికి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు, ఇన్‌ఛార్జి మేనేజింగ్ ట్రస్టీ శ్రీ గంగుల చంద్రారెడ్డిగారు ఉత్తర ద్వార దర్శన కార్యక్రమంలో పాలుపంచుకోవటానికి ఆశ్రమానికి విచ్చేసారు. జరిగిన ఏర్పాట్లను పర్యవేక్షించి, 9వ తేదీ హోమ కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లను సమీక్షించి పనులను వేగవంతం చేయించారు.

జనవరి 9వ తేదీ, గురువారం ఉ.గం.9.00లకు పుణ్యాహవచనం, గణపతి పూజ, పంచగవ్య స్థాపన, అఖండ స్థాపన, రక్షాబంధనము, గోపూజ, ఆదిత్యాది నవగ్రహ వాస్తు పూజలు, లక్ష్మీనారాయణ మంటపారాధనలు, మూలవిరాట్టుకు విశేషస్నపనము, స్వామి వారికి తులసి దళార్చన, తదుపరి నవగ్రహ, వాస్తు, దేవతా హోమములు, పురుషసూక్త, శ్రీసూక్త, మన్యు సూక్త హోమములు, సుదర్శన హోమములు, పూర్ణాహుతి, ప్రసాద వితరణ జరిగినవి. ఈ హోమ కార్యక్రమములో రామాలయ ప్రధాన ద్వారాన్ని, తలుపులను సమర్పించిన శ్రీ దరిపల్లి రామ కోటయ్య, సత్యవతి దంపతులు, దక్షిణ ద్వారానికి కొంత ఆర్థిక సహకారాన్ని అందించిన శ్రీ రాయుడు పానకాలరావు, లక్ష్మి దంపతులు, ఉత్తర ద్వారం, తలుపులు సమర్పించిన శ్రీ శాత్రాసుపల్లి గోపీకుమార్, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసినది.

జనవరి 10వ తేదీ వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన కార్యక్రమానికి అలంకరణ కార్యక్రమాలు, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ ఏర్పాటు, మరొకప్రక్క స్వామి వారి దర్శనానికి అటు బాబా మందిరంలోనూ, ఇటు రామాలయంలోనూ ఏర్పాట్లు, ఒకప్రక్క ఆలయాలన్నిటికీ విద్యుద్దీపాలంకరణ, మరొకప్రక్క కార్యక్రమానికి కావలసిన పులిహోర, రవ్వకేసరి ప్రసాదాలు తయారుచేయటానికి వంటవాళ్ల హడావుడి, అలంకరణ నిమిత్తం తెచ్చిన బంతిపూలు మాలలుగా గుచ్చటానికి వచ్చిన భక్తుల కోలాహలం, సాయిధామం నుండి శ్రీ ఎస్. నర్సింహా మరియు శ్రీ నర్సింహారెడ్డిగార్లు మరుసటి రోజు కార్యక్రమంలో పాలుపంచుకోవటానికి రావటం, ఎవరి పనులలో వారుండగా సాయం సంధ్య చీకటి పడే వేళకి ఆశ్రమమంతా విద్యుద్దీప కాంతిలో శోభాయమానంగా వెలుగొందింది. అనంతరం స్వామి వార్లందరికీ నూతన వస్త్రధారణ, పూలమాలాలంకరణ, ఆలయ ద్వారాలకు మామిడి తోరణాలు, పూలమాలాలంకరణ, అంతరాలయంలో అలంకరణ, రామాలయం ముందు ఏర్పాటు చేసిన కలశాలతో శంఖు, చక్ర, గోవింద నామాలు అలంకరణ మొదలైన అన్ని పనులు పూర్తయ్యే సరికి వేకువజాము గం.3.30 లైనది. గం.4.30లకు ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ సత్యపదానంద ప్రభుజీ వారి చిత్రపటాన్ని, పాదులను తీసుకుని మంగళ వాయిద్యాలు సుస్వరంగా మ్రోగుతుండగా అందరమూ ఆశ్రమ ప్రధాన ద్వారము వద్దకు చేరుకున్నాము. అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు కొబ్బరికాయ కొట్టి, హారతిచ్చి ప్రధాన ద్వారాన్ని తెరిచారు. తరువాత శ్రీరామ జయరామ జయ జయ రామ అని రామ నామం పలుకుతూ భక్త జన సందోహం వెంటరాగా, అన్ని ఆలయాల ప్రధాన ద్వారాలు, ఉత్తర ద్వారాలు, మూల విరాట్టుల దగ్గర కొబ్బరికాయ కొట్టి దీపాలు వెలిగించి, హారతిచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు.





అనంతరం ఉత్సవమూర్తుల వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం గం.5.00 ల నుండి భక్త జన ప్రవాహం మధ్యాహ్నం రెండు గంటల వరకు సుమారు 3,500 మంది భక్తులు నూతన వస్త్రాలతో, పూల మాలాలంకృతులై, దివ్యతేజస్సుతో వెలుగొందుతున్న ఉత్సవ మూర్తులు, మూల విరాట్టులను దర్శించి తరించారు. ఆశ్రమమంతా శ్రీరామ జయరామ జయ జయ రామ నామంతో పులకించింది. వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు, మంచినీరు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందించారు. కార్యక్రమం ఆద్యంతం ముందుండి నడిపించిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారికి, అంతర్లీనంగా మమ్మందరినీ నడిపిస్తున్న పరమపూజ్య గురుదేవులు, పూజ్య మాతాజీగార్లకు భక్తి పూర్వక నమస్కారములు తెలియజేసుకుంటున్నాము.

ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పిల్లలు, పెద్దలు, కుర్రవాళ్ళు, మాతృమూర్తులందరికీ శ్రీరామరక్ష, శ్రీ సాయీ సేవా సమితి తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాము.

- : జై శ్రీరామ్ : -

**దేవుడు అంత దూరంలో ఉన్నాడా?**

**అతడు ఆకాశం పైనా లేడు - పాతాళం క్రిందా లేడు.**

**ఎప్పుడూ అతడు నీ దగ్గరే ఉన్నాడు!**

**ఆయన్ను వెదకటానికి ఎక్కడికి వెళ్ళనక్కరలేదు.**

**మానవ రూపంలో ఉన్న దైవాన్ని చూడు.**

**- 'సాయీ సూక్తి సుధ' నుంచి.**